‘సంక్షేమ’ అరువు భోజనం!

- జూన్ నుంచి అందని మెస్ చార్జీలు
- రూ.లక్షల్లో పేరుకుపోయిన బిల్లులు
- అప్పులు చేసి భోజనాలు పెడుతున్న వసతిగృహాల సిబ్బంది
- బిల్లుల కోసం తప్పని ఎదురు చూపులు
- కాస్మొటిక్ చార్జీలను సైతం విడుదల చేయని కూటమి సర్కారు


దాచేపల్లిలోని బీసీ బాలుర వసతి గృహం

దాచేపల్లి: కూటమి సర్కారు సంక్షేమ వసతి గృహాలపై నిర్లక్ష్యం చూపుతోంది. చదువుకోవాలనే ఆశతో ఆర్థిక స్తోమత లేక సర్కారు వసతిగృహాల్లో ఉంటూ పలువురు పేద విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరంతా కడుపునిండా భోజనం లేక అల్లాడిపోతున్నారు. నిరుపేదలు తలదాచుకునే సంక్షేమ వసతి గృహాలకు మెస్ బిల్లులు విడుదల చేయకపోవటంతో విద్యార్థులతో పాటుగా వసతి గృహాల అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. అప్పు చేసి పప్పు కూడు విద్యార్థులకు అందజేస్తున్నారు. ఈ ఏడాది జూన్ మాసం ప్రారంభం నుంచి హాస్టళ్లకు సంబంధించిన మెస్ చార్జీలు ప్రభుత్వం విడుదల చేయకపోవటంతో అప్పుల మీద అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహార పదార్థాలు అందించటం వసతిగృహాల అధికారులకు కత్తిమీద సాములా మారింది.

రూ.30 లక్షల వరకు బకాయిలు..

గురజాల నియోజకవర్గ వ్యాప్తంగా దాచేపల్లి, పిడుగురాళ్ల, మాచవరం, గురజాల మండల కేంద్రాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, బాలబాలికల వసతి గృహాలు ఉన్నాయి. వీటిల్లో సుమారుగా 750 మందికిపైగా విద్యార్థులు ఉంటూ చదువుకుంటున్నారు. సుమారుగా రూ.30లక్షల వరకు మెస్ చార్జీల బకాయిలను ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. ప్రతి నెల బిల్లుల కోసం వసతిగృహాల అధికారులు ఎదురు చూస్తున్నారు. వసతిగృహాలకు నిత్యవసర సరుకులను సరఫరా చేసేందుకు టెండర్లు దక్కించుకున్న ఏజెన్సీలు ప్రస్తుతం ధరలు పెరిగిపోవటంతో నామమాత్రంగానే అందిస్తున్నారు. జూన్, జూలై మాసాల్లో బీసీ వసతి గృహాలకు కొంతమేరకు బిల్లులు వచ్చినట్లు వార్డెన్లు చెబుతున్నారు.

కాస్మొటిక్ చార్జీలదీ అదే పరిస్థితి..

వసతి గృహాల్లో కాస్మొటిక్ చార్జీలను సైతం కూటమి ప్రభుత్వం చెల్లిచటంలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కాస్మొటిక్ చార్జీలను ప్రతి నెల విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాల్లోనే జమ చేసేది. కానీ నేటి కూటమి ప్రభుత్వం కాస్మొటిక్ చార్జీలను విడుదల చేయకపోవటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మూడు నుంచి ఆరో తరగతి వరకు బాలురకు నెలకు రూ.120, బాలికలకు రూ.130, ఏడు నుంచి పదవ తరగతి వరకు బాలురకు రూ.150, బాలికలకు రూ.200, ఇంటర్ ఆపైన చదివే విద్యార్థులకు రూ.200 చొప్పున కాస్మొటిక్ చార్జీలను చెల్లించాల్సి ఉంది. జూన్ నెల ప్రారంభం నుంచి కాస్మొటిక్ చార్జీలను చెల్లించలేదు.

గతంలో ఠంచనుగా బిల్లులు...

నెలలు తరబడి బిల్లులు రాకపోవటం.. విద్యార్థుల కోసం కిరాణా, పాలు, గుడ్లు, మాంసం, కూరగాయల దుకాణాల వద్ద అప్పులు పెరిగిపోవటంతో ఆహార పదార్థాలను అందించటం అధికారులకు కష్టంగా మారింది. పెరిగిన నిత్యావసరాల ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని ప్రభుత్వంపై విద్యార్థి సంఘాలు ఒత్తిడి తీసుకువస్తున్న తరుణంలో అరువు ఇచ్చేందుకు వ్యాపారులు ఇష్టపడకపోవటంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఠంచన్‌గా మెస్ చార్జీలను ప్రభుత్వం విడుదల చేయటంతో విద్యార్థులకు రుచికరమైన ఆహార పదార్థాలు అందేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్క రూపాయి మెస్ చార్జీలను విడుదల చేయకపోవటంతో వసతిగృహాల్లో ఉండే పేద విద్యార్థులు భోజనానికి ఇబ్బంది పడాల్సిన దుస్థితి.


విద్యార్థులకు అందించే మెనూ చార్ట్

మెస్ చార్జీలు సత్వరం విడుదల చేయాలి



ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో చదువుకునే విద్యార్థులకు మెస్ చార్జీలను విడుదల చేయటంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది. గత నాలుగు నెలలుగా మెస్ చార్జీలను చెల్లించకపోతే విద్యార్థులకు ఏ విధంగా ఆహార పదార్థాలు అందిస్తారు?. అర్ధాకలితో విద్యార్థులు ఏలా చదువుకోవాలి. వార్డెన్లు అప్పులు చేసి ఎంతకాలం వసతిగృహాల్లోని విద్యార్థులకు ఆహార పదార్థాలు అందివ్వాలి. వసతిగృహాలపై ప్రభుత్వం నిర్లక్ష్యం తగదు. ప్రభుత్వ పెద్దలు జోక్యం చేసుకుని మెస్ చార్జీలను విడుదల చేయాలి.

– మందపాటి దుర్గారావు, వైఎస్సార్ సీపీ నేత, దాచేపల్లి

వసతిగృహాలపై నిర్లక్ష్యం తగదు



వసతిగృహాల నిర్వహణపై ప్రభుత్వానికి నిర్లక్ష్యం తగదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు చదువుకునే వసతి గృహాలపై కూటమి ప్రభుత్వం దయ చూపటం లేదు. నెలల తరబడి బిల్లులు చెల్లించకపోతే విద్యార్థులు ఏలా ఉండాలి..ఏమి తినాలి. ప్రభుత్వం తక్షణమే స్పందించి మెస్ చార్జీలు, కాస్మొటిక్ చార్జీలను విడుదల చేయాలి. లేదంటే విద్యార్థుల తరఫున పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం.

– అంజనేయరాజు. సీపీఎం మండల కార్యదర్శి, దాచేపల్లి

క్లుప్తంగా

గురజాల డీఎస్పీ జగదీష్ బాధ్యతలు స్వీకరణ



గురజాల: డీఎస్పీ బి.జగదీష్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ విధులు నిర్వహించిన పల్లపురాజు బదిలీ కావడంతో గత ఎన్నికల సమయంలో ట్రైనీ డీఎస్పీగా విధులు నిర్వహించిన బి.జగదీష్‌ను గురజాల డీఎస్పీగా నియామకం చేశారు. సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది డీఎస్పీని కలిసి అభినందనలు తెలిపారు.

మాచవరం పీహెచ్‌సీలో డీఐఓ తనిఖీలు



మాచవరం: మాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిణి డాక్టర్ గీతాంజలి శనివారం ఆకస్మికంగా సందర్శించారు. పీహెచ్‌సీ పరిసరాలను, ఫార్మసీలోని మందులను పరిశీలించారు. ప్రజలకు అందిస్తున్న ఆరోగ్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని ఆరోగ్య ఉప కేంద్రంలో తనిఖీలు చేపట్టి , రికార్డులను పరిశీలించారు. ఏఎన్ఎంల పనితీరును పరిశీలించి, తగు సూచనలు అందించారు. సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేసారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసాద్, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలో ఎంపీడీఓ తనిఖీలు



మాచవరం: మండల కేంద్రమైన మాచవరం ఎంపీపీ పాఠశాల్లో ఎంపీడీఓ పి.శ్రీనివాసరావు శనివారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం, విద్యాబోధన, పరిసరాల పరిశీలన, తాగునీరు, తదితర అంశాలపై ఉపాధ్యాయులతో చర్చించారు. విద్యాభివృద్ధికై ప్రభుత్వం అందిస్తున్న పథకాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించి, బయటి పిల్లలు సైతం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విధంగా చూడాలన్నారు. ఆయన వెంట కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు ఉన్నారు.

సత్రశాల దేవస్థానానికి డస్ట్‌బిన్లు వితరణ



రెంటచింతల: మండల పరిధిలోని సత్రశాల వద్దఉన్న శైవక్షేత్రం గంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామి దేవస్థానానికి హైదరాబాద్‌కు చెందిన వేదసీడ్స్ ఆర్ఎం రమేష్ 25 డస్ట్‌బిన్లు అందజేసినట్లు ఈఓ గాదె రామిరెడ్డి శనివారం తెలిపారు. కార్తికమాసం సందర్భంగా దేవస్థానంలోని స్వామివార్లను దర్శించుకునేందుకు రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన వేలాదిమంది భక్తులు తరలివస్తారన్నారు. దేవస్థానం ప్రాంగణం అంతా పరిశుభ్రంగా ఉంచడానికి ఈ డస్ట్‌బిన్లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. దేవస్థానం ప్రధాన అర్చకుడు చిట్టేల శివశర్మ, వెన్నా వెంకటేశ్వరరెడ్డి, మున్నా ప్రభురాజు తదితరులున్నారు.

విద్యార్థులపై స్కూల్ పీడీ కక్షసాధింపు


సంఘటనలో గాయపడ్డ అష్వక్

నరసరావుపేటటౌన్: విద్యార్థిపై దాడికి పాల్పడ్డ ప్రైవేటు స్కూల్ పీడీపై చర్యలు తీసుకోవాలని బాధితుడి తల్లిదండ్రులు శనివారం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పనసతోటకు చెందిన షేక్ మహ్మద్ అష్వక్ కోటసెంటర్‌లోని శ్రీచైతన్య ప్రైవేట్ పాఠశాల్లో 7వ తరగతి చదువుతున్నాడు. గత నెల 23వ తేదీ స్కూల్ భవన సెల్లార్‌లో కబడ్డీ ఆడుతూ పడ్డాడు. సంఘటనలో అష్వక్ చెయ్యి విరిగింది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు సంఘటనపై స్కూల్ యాజమాన్యానికి ఫిర్యాదు చేశారు. క్రీడా మైదానంలో నిర్వహించాల్సిన కబడీ శిక్షణ అనధికార సెల్లార్‌లో నిర్వహించటం ఏమిటంటూ ప్రశ్నించారు. సంఘటన జరిగిన 4 గంటల తర్వాత సమాచారం ఇచ్చారని విచారణ జరిపి పీడీపై చర్యలు తీసుకోవాలని స్కూల్ యాజమాన్యాన్ని కలిసి వారం క్రితం కోరారు. దీనిపై కక్ష పెంచుకున్న పీడీ కె. కళ్యాణ్ విద్యార్థి, అతని స్నేహితుడిని తరచూ వేధిస్తూ కొడుతున్నా డు. దీంతో తల్లిదండ్రులు, బంధువులు పాఠశాల వద్దకు వెళ్లి శనివారం ఆందోళనకు దిగా రు. సమాచారం అందుకున్న టూటౌన్ సీఐ హైమారావు సిబ్బందితో శ్రీ చైతన్య పాఠశాల వద్దకు వెళ్లి ఆందోళన చేస్తున్న వారికి నచ్చచెప్పారు. ఈ మేరకు బాధితుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కన్నీటి ప్రార్థనతో పూర్వీకులను స్మరించుకుందాం

రెవ.ఫాదర్ మోపూరి రాయపురెడ్డి


సమాధుల వద్ద సమష్టి దివ్యపూజా బలిని సమర్పిస్తున్న ఫాదర్లు

రెంటచింతల: కన్నీటి ప్రార్థనతో మృతి చెందిన తమ పూర్వీకులను, ఆత్మీయులను కతోలికులు స్మరించుకోవడమే ఆత్మల పండుగని రెవ.ఫాదర్ మోపూరి రాయపురెడ్డి అన్నారు. శనివారం స్థానిక కానుకమాత చర్చి ఆవరణలోని సమాదుల వద్ద విచారణ గురువులు రెవ.ఫాదర్ ఏరువ లూర్దుమ రెడ్డి నేతృత్వంలో రెవ.ఫాదర్లు మోపూరి రాయపు రెడ్డి, ఏరువ బాలశౌరెడ్డి, తుమ్మా వెలాంగిణి, అగస్టీన్, నిఖిల్‌తో కలిసి ఆత్మల పండుగ సందర్భంగా సమష్టి దివ్యబలి పూజను సమర్పించారు. ఈ సందర్భంగా ఫాదర్ మోపూరి రాయపు రెడ్డి భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి క్రైస్తవుడు భూలోకంలోని స్వర్గ స్థలమైన సమాధులలో ఉన్న వారి కుటుంబ సభ్యులతో తమకు ఉన్న మధుర స్మృతులను, అనుబంధాన్ని గుర్తుచేసుకుంటారన్నారు. ప్రతి క్రైస్తవ కుటుంబం కూడా క్రమం తప్ప కుండా ప్రతి సంవత్సరం నవంబర్ 2న తమ పూర్వీకులను భూస్థాపితం చేసిన సమాధులను కొవ్వొత్తులు, రకరకాల పూలతో అలంకరించి వారి ఆత్మలకు నిత్య విశ్రాంతిని ప్రసాదించాలని, దైవలోకం చేరుకోవాలని కోరుతూ దివ్యబలిపూజలో పాల్గొంటారన్నారు. తొలుత లాటిన్ భాషలో సాంగ్యాలతో సకల పునీతుల ప్రార్థన చేశారు. అనంతరం ఫాదర్లు సమాదులను తీర్థజలంతో ఆశీర్వదించారు. ఈ సమష్టి దివ్యపూజాబలిలో చర్చి మతకన్యలు, చర్చిపెద్దలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి


డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పిడుగురాళ్ల: పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కోటా సాయికుమార్ అన్నారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ సుధాకర్ శర్మకు పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న రూ. 3480 కోట్ల రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్రారంభించాలని, ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా సంక్షేమ హాస్పటల్స్ కాస్మొటిక్ చార్జీలు పెంచాలని, అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మొటిక్ చార్జీలను విడుదల చేయాలన్నారు. ఎస్ఎఫ్ఐ పిడుగురాళ్ల మండల ప్రెసిడెంట్ రోహిత్, నాయకులు యాసిన్, బెనర్జీ, ఉదయ్ తదితరులు ఉన్నారు.

అన్నదానం.. పుణ్యకార్యం

- ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి
- 1050 మంది భక్తులకు మహాన్నదానం


అన్నదాన కార్యక్రమం ప్రారంభిస్తున్న మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

సత్రశాల(రెంటచింతల): అన్నం పరబ్రహ్మ స్వరూపమని భక్తులకు అన్నదానం చేస్తే భగవంతునికి చేసినట్లేనని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శనివారం కార్తికమాసం ప్రారంభం సందర్భంగా సత్రశాల వద్ద వేంచేసిన అతి ప్రాచీన శైవక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామి దేవస్థానంలో స్వామివారిని దర్శించుకున్న భక్తులకు ఏర్పాటు చేసిన మహాన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కైలాసనాథుడు శివయ్యకు ఎంతో ప్రీతికరమైనది కార్తిక మాసమని ఈ మాసంలో స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహిస్తే ఎంతో పుణ్యమన్నారు. తొలుత ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అనంతరం స్వామివార్లను దర్శించుకుని నూతన వస్త్రాలను అందచేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 1050 మంది భక్తులకు మహాన్నదానం చేసినట్లు ఈఓ గాదె రామిరెడ్డి తెలిపారు. పరాశక్తి ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ ఎంఎస్ఎన్ రాజు, వైస్ ఎంపీపీ గొంటు సుమంత్‌రెడ్డి, సీహెచ్ అబ్బిరెడ్డి, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ..

మాచర్ల: సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ. 35 లక్షలను ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి 30 మంది బాధితులకు పంపిణీ చేశారు. పట్టణంలోని నెహ్రూనగర్‌లోని టీడీపీ కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టండి

వినుకొండ(నూజెండ్ల): అభివృద్ధికి ఆమడ దూరంలో వినుకొండ మండలంలోని విఠంరాజుపల్లి పంచాయతీలో గల వైకంటి శివప్రసాద్ ఎస్టీ యానాది కాలనీ ఉందని సీపీఐ ఏరియా కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు ప్రభుత్వాలపై మండిపడ్డారు. సీపీఐ ఆధ్వర్యంలో కాలనీలోని పరిస్థితులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ కాలనీలో రోడ్ల పరిస్థితి ఏమాత్రం బాగా లేక డ్రెయినేజీ వ్యవస్థ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మలేరియా, టైఫాయిడ్ లాంటి విషజ్వరాలు సోకి ప్రజలు ఇబ్బంది పడకముందే కాలనీలో పారిశుద్ధ్యం మెరుగుపరచాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ నిధులతో రోడ్లు, డ్రెయినేజీలు, మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కొప్పరపు మల్లికార్జున, నాగరాజు, ఆదెయ్య, సుజాత, లక్ష్మి, పేరమ్మ, నాగరాణి, దేవి తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై శనగ విత్తనాలు

నాదెండ్ల: సబ్సిడీపై రైతులకు ఇస్తున్న శనగలను సద్వినియోగం చేసుకోవాలని నరసరావుపేట ఏడీఏ పి.మస్తానమ్మ చెప్పారు. మండలంలోని సాతులూరు రైతు భరోసా కేంద్రంలో సర్పంచ్ ముసుగు శోభారాణి చేతుల మీదుగా రైతులకు 80 క్వింటాళ్ల శనగలను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలానికి 1115 క్వింటాళ్లు శనగలు కేటాయించారని, మొదటి విడతగా సుమారు 400 క్వింటాళ్లు అందాయని, సాతులూరు గ్రామానికి 80 క్వింటాళ్లు కేటాయించినట్లు తెలిపారు. సగటున రైతుకు రెండు క్వింటాళ్ల వరకూ సబ్సిడీపై విత్తనాలు అందిస్తామన్నా రు. కావలసిన రైతులు పాసుపుస్తకం జిరాక్సు, ఆధార్ కార్డుతో రావాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు బి.సత్యనారాయణ, ఏఈఓలు రామారావు, వేణుగోపాల్, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో అక్షర వెలుగు

బొల్లాపల్లి: నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయడమే ప్రభుత్వ ఉద్దేశమని ఇన్‌చార్జి ఎంపీడీవో కె.ప్రభాకరరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వెలుగు పథకంలో భాగంగా నిర్వహించిన అక్షర వెలుగు కార్యక్రమంలో ఒక రోజు శిక్షణ శనివారం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యులైన మహిళలు, పురుషులను గుర్తించి వారికి చదవడం, రాయడం నేర్పడం చేయాల్సిన బాధ్యత వెలుగు పథకం సిబ్బందిపై ఉందని తెలిపారు. గ్రామాల్లో నిరక్షరాస్యులైన వారిని గుర్తించాల ని సూచించారు. శిక్షణ అనంతరం గ్రామాల్లో తప్పనిసరిగా నిరక్షరాస్యులను గుర్తించాలని, వారికి ప్రతిరోజూ సమయ సూచక ఏర్పాటు చేసుకొని ఈ విషయాలను వారికి బోధించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో సూచించారు. శిక్షణలో ఏపీఎం పి.వి.రంగారెడ్డి, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

ప్రచార జాతను జయప్రదం చేయండి

నరసరావుపేట ఈస్ట్: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులు, కార్మికుల పట్ల అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ఈనెల 5న నరసరావుపేటకు రానున్న కార్మిక, రైతు సంఘాల ప్రచార జాతాను జయప్రదం చేయాలని రైతు సంఘం నాయకుడు సత్యనారాయణరాజు పిలుపునిచ్చారు. సీపీఐ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం రైతులపై నల్ల చట్టాలను బలవంతంగా రుద్దాలని చూస్తున్నదని ఆరోపించారు. ఈనెల 26న జిల్లా కలెక్టరేట్‌ల ఎదుట ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో అంజిరెడ్డి, ఉప్పలపాటి రంగయ్య పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు శంకరభారతీపురం విద్యార్థులు


రాష్ట్ర జట్టుకు ఎంపికైన విద్యార్థులతో పాఠశాల హెచ్‌ఎం పార్వతి, ఉపాధ్యాయులు

నరసరావుపేట రూరల్: లింగంగుంట్ల శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన పోటీలలో పలు విభాగాలలో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయినీ ఎం.పార్వతి శనివారం తెలిపారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అండర్–14,17 పోటీలలో అథ్లెటిక్స్, బాల్‌బాడ్మింటన్, ఖోఖో, టెన్నికాయిడ్ క్రీడలలో ఎంపికై నట్టు తెలిపారు. అథ్లెటిక్స్‌లో సి.హెచ్.నాగవైష్ణవి, బి.రాజేశ్వరి, బాల్‌బాడ్మింటన్‌లో కె.కిరణ్‌కుమార్, ఎస్‌కె.ఆరీఫ్, జీ.భానురామ్‌ప్రసాద్, పి.రాజశ్రీ, ఖోఖోలో బి.సౌజన్య, టి.లక్ష్మీప్రసూన చంద్రిక, డి.రంగమహాలక్ష్మి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన వారిలో ఉన్నారని వివరించారు. రాష్ట్ర జట్టుకు ఎంపికైన వారు ఆయా క్రీడలకు కేటాయించిన జిల్లాల్లో, తేదీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయినీ పార్వతి, వ్యాయామ ఉపాధ్యాయులు జి.ఝాన్సీరాణి, షేక్.ఫాతిమా, పి.తిరుపతి రావు, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

ఆలయాల్లో కార్తిక మాస పూజలు

మాచర్ల: కార్తికమాసం ప్రారంభం సందర్భంగా శనివారం పట్టణంలోని శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీశైలం రోడ్డులోని స్వామి అయ్యప్ప, జమ్మలమడక వెళ్లే రహదారిలో రామప్ప దేవాలయం, సొసైటీ కాలనీలోని మాతా అన్నపూర్ణేశ్వరి దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ నిర్వాహకులు, సభ్యులు, సంఘాల నాయకులు, టీడీపీ నేతలు, అభిమానులు, భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

గురజాల: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని అంబాపురం గ్రామానికి చెందిన లోకసాని నాగిరెడ్డి (38) అంబాపురం నుంచి గురజాలకు ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. మార్గ మధ్యలో వాగ్దేవి కళాశాల వద్ద బైపాస్ నుంచి దిగుతుండగా ముందుగా వెళ్తున్న టిప్పర్‌ను అధిక వేగంతో వచ్చి ఢీకొట్టాడు. టిప్పర్ వెనుకభాగం నాగిరెడ్డి తలకు గట్టిగా తగలడంతో అక్కడికక్కడే కిందపడిపోయి మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు.

పేరంటాలమ్మ గుడిలో చోరీ

మాచవరం: మండల కేంద్రమైన మాచవరంలోని పేరంటాలమ్మ దేవాలయంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. శనివారం ఉదయం దేవాలయం గేటు తాళాలు పగలగొట్టి ఉండడం గమనించిన స్థానికులు నిర్వాహకులకు తెలియజేశారు. దేవాలయంలోని సుమారు రూ.20 వేలు విలువ చేసే ఇత్తడి సామగ్రి, హుండీలోని నగదు దొంగతనానికి గురైనట్లు గుర్తించారు. సమీపంలోని గంగమ్మ గుడిలోనూ ఇత్తడి గుడి గంటలు చోరీకి గురయ్యాయి. నిర్వాహకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వీరుల గుడి ప్రాంగణం.. శుభ్రం

సాక్షి ఎఫెక్ట్


వీరుల గుడి ప్రాంగణాన్ని బాగు చేస్తున్న కూలీలు

కారెంపూడి: పల్నాడు జిల్లాలో ప్రఖ్యాతిగాంచిన వీరుల గుడి ప్రాంగణం దుస్థితి. అక్కడ నెలకొన్న అధ్వాన స్థితిగతులపై ‘సమస్యల రణక్షేత్రం’ శీర్షికన గత నెల 27వ తేదీన ‘సాక్షి’లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. దేవాలయంలో పారిశుద్ధ్య నిర్వహణ, జంగిల్ క్లియరెన్స్ తదితరాలపై పల్నాటి వీరాచార పీఠాధిపతితో చర్చించి శుభ్రం చేయించే పనులు చేయిస్తున్నారు. వీరుల గుడి ప్రాంగణంలో పిచ్చి చెట్లు, గడ్డి జాతి మొక్కలను తొలగిస్తున్నారు. వీరాచారవంతులు సేద తీరే వీరుల గుడి ఆవరణలోని రాతి గదులను శుభ్రం చేస్తున్నారు. దాంతో పాటు గుడి ప్రాంగణాన్ని కూడా బాగు చేస్తున్నారు.

పోతురాజుకు పడిగెం కట్టే కార్యక్రమం..

ఈ నెల 15 లేదా 16వ తేదీల్లో పోతురాజుకు పడిగెం కట్టే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పల్నాటి వీరాచార పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవ తెలిపారు. ఆ రోజు చెన్నకేశవుని చెంత ఉన్న బ్రహ్మనాయుడు ఆయుధం నృసింహకుంతాన్ని, పల్నాటి వీరాచార పీఠం (చెన్నకేశవ పీఠం)ను వీరుల గుడికి తరలిస్తారు. ముందుగా నాగులేరులో పూజల అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి అలంకారం చేసి గ్రామోత్సవంగా చెన్నకేశవస్వామి చెంతకు ఆ తర్వాత అంకాలమ్మ గుడి ప్రాంగణంలోని నగరేశ్వరస్వామి ఆలయ ముఖద్వారానికి ఏర్పాటు చేసే జ్వాలా తోరణం గుండా అమ్మవారిని దర్శించుకుని అనంతరం పీఠాధిపతితో వీరుల గుడికి తరలివచ్చి వీరుల గుడిలో ఉన్న పోతురాజు శిలకు పడిగెం కడతారు. ఈవిధంగా పల్నాటి వీరారాధన ఉత్సవ ఏర్పాట్లుకు శ్రీకారం చుడతారు. ఈసారి చాలా ముందుగానే వివిధ రకాల వినోద ప్రదర్శనలు, జెయింట్ వీల్ లాంటి రంగుల రాట్నాలు ముందుగానే ఉత్సవ ప్రాంగణానికి వస్తున్నాయి.



సాక్షిలో ప్రచురితమైన కథనం

విద్యావంతులను చేయడమే వలంటీర్ల బాధ్యత

ప్రత్యేక అధికారి వి. శ్రీనివాసరావు


శిక్షణ తరగతులలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

రెంటచింతల: తన పరిధిలోని చదువురాని వారిని గుర్తించి విద్యావంతులను చేయడమే లక్ష్యంగా వలంటీర్లు విధులు నిర్వహించాలని మండల ప్రత్యేక అధికారి వి.శ్రీనివాసరావు అన్నారు. శనివారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వలంటీర్లకు ఉల్లాస్ ట్రెనింగ్ ప్రోగ్రాంపై నిర్వహించిన శిక్షణ తరగతులలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమాజంలో అందరికీ జీవితకాల అభ్యాసంపై అవగాహన కల్పించడంలో భాగంగా వలంటీర్లకు ఈ శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వలంటీర్లు వారి పరిధిలోని 10 మంది చదువులేని వారని గుర్తించి వారిని విద్యావంతులను చేయాలన్నారు. ఎంపీడీఓ సరోజినీదేవి, ఈఓపీఆర్డీ జి.అనంతకోటేశ్వరరావు, ఏపీఎం, సీసీ, వలంటీర్లు పాల్గొన్నారు.

స్వాములకు సద్ది ఏర్పాటు

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని పెద్ద పోస్టాఫీస్ వద్ద గల పాత శివాలయంలో గత ఐదు సంవత్సరాలుగా అయ్యప్పస్వాముల అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో రూ.6 లక్షలు వెచ్చించి వంటసామాన్లు భద్రపరిచే, వంట గదులు నిర్మించారు. ఈ సందర్భంగా కమిటీ వారు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా అయ్యప్పస్వాములకు సద్ది ఏర్పాటు చేస్తున్నామని, అందులో భాగంగా శనివారం నుంచి స్వాములకు ప్రతి రోజూ 600మందికి మధ్యాహ్నం సద్ది కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.